క్లుప్తంగా

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం

మాజీ మంత్రి హరీశ్‌రావు



వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు

చిన్నకోడూరు(సిద్దిపేట): వానాకాలం ప్రారంభమైన నేపథ్యంలో డెంగ్యూ, మలేరియా లాంటి విషజ్వరాలు విజృంభించే అవకాశం ఉందని, అవసరమైన మందులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు వైద్య సిబ్బందికి సూచించారు. సోమవారం చిన్నకోడూరు పీహెచ్‌సీని ఆయన సందర్శించారు. ఆస్పత్రిలో అందుతున్న సేవల గురించి ఆరా తీశారు. ఓపీ, ఫార్మసీలో అందుబాటులో ఉన్న మందులు, డయాగ్నోస్టిక్ సేవలు అందిస్తున్న తీరును పరిశీలించారు. డెంగ్యూ, మలేరియా కేసులు వస్తున్నాయా.. ఎలాంటి చికిత్సలు అందిస్తున్నారనే విషయాలు వైద్యురాలు సరితను అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో పరిస్థితులపై సమీక్షించారు. ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని సూచించారు.

విద్యతోనే సామాజిక పురోగతి

జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ



నోట్ బుక్స్ పంపిణీ చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్

చిన్నకోడూరు(సిద్దిపేట): విద్యతోనే ప్రజా చైతన్యం సాధ్యమని, అదే సామాజిక పురోగతికి సరైన మార్గమని జెడ్పీ చైర్‌పర్సన్ రోజా శర్మ అన్నారు. సోమవారం మండల పరిధిలోని రామంచ ప్రాథమిక పాఠశాలలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో చక్రపాణి ఆగ్రో ఇండస్ట్రీస్ సహకారంతో 130మంది విద్యార్థులకు నోట్ బుక్స్, పెన్నులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మనిషి జీవితాన్ని మార్చేది చదువు ఒక్కటేనన్నారు. అన్ని దానాల్లో విద్యా దానం ఎంతో గొప్పదని చెప్పారు. ప్రతి విద్యార్థి ఉన్నతంగా ఎదిగి తమ తోటివారికి చేయూతను అందించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్‌ఎం లక్ష్మయ్య, హెచ్‌ఎం అబ్దుల్ షరీఫ్, ఎంపీటీసీ వెంకటలక్ష్మి, ఉపాధ్యాయులు సురేశ్‌కుమార్, సునీత, వాణి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ మృతి

ములుగు(గజ్వేల్): మూర్ఛ వ్యాధితో కింద పడి తలకు గాయం కావడంతో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన ఘటన ములుగు మండలం మామిడ్యాల ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో సోమవారం చోటుచేసుకుంది. ములుగు ఏఎస్ఐ ప్రేమ్‌రాజ్ కథనం ప్రకారం.. కాలనీకి చెందిన రాచకొండ బాల్‌నర్సింహులు(50) కొంత కాలంగా మూర్ఛ వ్యాధితో బాధపడుతుండేవాడు. ఆదివారం మధ్యాహ్నం మూర్ఛకు గురై కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం కోంపల్లిలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ సోమవారం మధ్యాహ్నం మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

మహానంది అవార్డు



సత్తయ్యకు అవార్డును అందజేస్తున్న నిర్వాహకులు

బెజ్జంకి(సిద్దిపేట): మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు జయంతి ఉత్సవాల్లో భాగంగా మండలంలోని కల్లెపెల్లి గ్రామానికి చెందిన కళాకారుడు అన్నాజి సత్తయ్య మహానంది అవార్డును అందుకున్నారు. కరీంనగర్‌లో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో తెలుగు వెలుగు సాహితీ వేదిక ఆయనకు ఈ అవార్డును అందజేసింది. సత్తయ్య అనేక మంది యువకులకు చిడుతల రామాయాణం, వీరబ్రహ్మేంద్రస్వామి చరిత్ర, రేణుక ఎల్లమ్మ నాటకాలను నేర్పించారని కొనియాడారు.

రెగ్యులరైజ్ చేయాలని వినతి

సిద్దిపేటకమాన్: యూరోపియన్ కమిషన్ స్కీమ్ కింద విధులు నిర్వహిస్తున్న ఏఎన్‌ఎంలను రెగ్యులరైజ్ చేయాలని తెలంగాణ పబ్లిక్ హెల్త్ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు కోరారు. సోమవారం కలెక్టర్ మనుచౌదరి, డీఎంహెచ్‌ఓ శ్రీనివాస్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు వారు మాట్లాడుతూ 20 ఏళ్ల నుంచి విధులు నిర్వహిస్తున్నా ఇప్పటి వరకు క్రమబద్ధీకరించకపోవడం సరికాదన్నారు. ప్రధాన కార్యదర్శి భాస్కర్, మల్లేశం, రాజు, కొండయ్య, గణేశ్, కోటేశ్వరరావు, ఏఎన్‌ఎంలు రాజ్యలక్ష్మి, పద్మ తదితరులు పాల్గొన్నారు.

అడవి పందులతో ఆగం

ధ్వంసమవుతున్న నారుమళ్లు

- తీవ్రంగా నష్టపోతున్న రైతులు
- పట్టించుకోని అధికారులు



ధ్వంసమైన నారుమడిని చూపుతున్న రైతులు

అక్కన్నపేట(హుస్నాబాద్): ఆరుగాలం శ్రమించి గంపెడు ఆశలతో సాగు చేపట్టిన రైతులకు అడవి పందులతో ఇబ్బందులు తప్పడం లేదు. అక్కన్నపేట మండలంలోని కట్కూర్, దుబ్బతండా, చాపగానితండా, రామవరం గ్రామాల పరిధిలోని బంగారులొద్దితండా, దాస్‌తండా, వంకాయతండా, పంచరాయితండా, రాజుతండాలు గుట్టలు, కొండల సమీపంలో ఉన్నాయి. ఈ తండాల్లోనే ఆడవి పందుల బెడద అధికంగా ఉంది. రైతులు సాగుచేసే మొక్కజొన్న, వరి, పత్తి తదితర పంటలను ధ్వంసం చేస్తున్నాయి. ప్రస్తుతం మొక్కజొన్న, వరి మొలకెత్తుతున్న దశలో ఉన్నాయి. అడవిపందులు గుంపులు గుంపులుగా పంటచేలల్లో పడి నాశనం చేస్తున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు.

అప్పులే మిగులుతున్నాయి..

అడవి పందుల బెడదతో ఉన్న పంటలు కాస్తా చేతికి రాకుండా పోతుండటంతో అప్పులే మిగులుతున్నాయని రైతులు వాపోతున్నారు. మొక్కజొన్న, వరి మొలకెత్తుతున్న సమయంలోనే పంటలకు నష్టం సంభవించడంతో సాగుకోసం పెట్టిన ఖర్చులు కూడా రాని పరిస్థితులు ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంటలను రక్షించుకునేందుకు చుట్టూ చీరలతో రక్షణ వలయం ఏర్పాటు చేస్తున్నామని, అయినా వాటి బారి నుంచి కాపాడుకోలేక పోతున్నామని వాపోతున్నారు.

ప్రభుత్వం ఆదుకోవాలి

నియోజకవర్గంలోని అక్కన్నపేట మండలంలోని అటవీప్రాంత గ్రామాల పరిధిలోని పంటచేలల్లో అడవిపందుల కారణంగా ప్రతిఏటా పంటలకు నష్టం జరుగుతున్నా అటవీశాఖ ఎలాంటి సాయం అందించడం లేదు. దశాబ్ద కాలంగా ఈ సమస్య ఉంది. వాటి నుంచి పంటలను రక్షించుకునేందుకు రాత్రి, పగలు తేడా లేకుండా చేలల్లోనే కాపలా ఉంటున్నారు. ఒక్కోసారి పందులు గుంపులుగా వచ్చి దాడి చేస్తాయనే భయంతో ఏం చేయలేని పరిస్థితి. ఇప్పటికే పలు గ్రామాల్లో మొక్కజొన్న, వరి నారుమడులను ధ్వంసం చేశాయి. కనీసం పెట్టుబడులు కూడా వచ్చేలా లేవని రైతులు ఆందోళన చెందుతున్నారు.

పరిహారం చెల్లించాలి



అడవిపందుల దాడిలో నష్టపోయిన పంటలకు ప్రభుత్వం పరిహారం ఇవ్వాలి. ఎన్నో ఏళ్లుగా తాము సాగు చేస్తున్న వరి, మొక్కజొన్న, పత్తి పంటలకు తీవ్ర నష్టం కలుగుతోంది. అయినా తమ గోడును ఎవ్వరూ పట్టించుకోవడం లేదు.

– లావుడ్యి మహేశ్, రైతు, బంగారులొద్దితండా

నష్టపరిహారం అందుతుంది

అడవిపందుల దాడిలో పంటలు ధ్వంసం అయితే వ్యవసాయ అధికారుల చేత పంచనామా చేయించి అటవీశాఖ అధికారులకు అప్పగించాలి. అప్పుడు సంబంధిత రైతుకు ప్రభుత్వం నుంచి నష్ట పరిహారం అందుతుంది. మొక్కజొన్న, వరి నారుమళ్ల చుట్టూ పందులు రాకుండా రక్షణగా చీరలను ఏర్పాటు చేసుకోవాలి.

– సందీప్, ఫారెస్ట్ రేంజ్ అధికారి, హుస్నాబాద్



ఎంపీపీ నిర్మల దంపతులను సన్మానిస్తున్న నాయకులు

సమస్యలను వెంటనే పరిష్కరించాలి

- రైతు భరోసా, రుణమాఫీ అమలు చేయాలి
- మండల సమావేశంలో ఎంపీటీసీలు

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కారించాలనిచ సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా వైద్య శిబిరాలను ఏర్పాటు చేయాలని ఎంపీటీసీలు కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఎంపీపీ లింగాల నిర్మల అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీటీసీలు మాట్లాడుతూ వెంటనే రైతు భరోసా, రుణమాఫీ అమలయ్యేలా చూడాలని కోరారు. ఇన్‌చార్జి ఎంఈఓను కాకుండా మండలంలోని సీనియర్ హెచ్‌ఎంను ఎంఈఓగా నియమించాలని సూచించారు. సభ్యుల డిమాండ్‌లను ఉన్నతాధికారులకు నివేదిస్తామని ఎంపీపీ నిర్మల తెలిపారు. అనంతరం ఎంపీపీ, ఎంపీటీసీల పదవీకాలం ముగుస్తుండటంతో వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఎంపీపీ, వైస్ ఎంపీపీలను మెమెంటోలు, పూలమాలలతో ఎంపీటీసీలు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీడీఓ లక్ష్మప్ప, వైఎస్ ఎంపీపీ చెలుకల సబిత, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నూతన ఎస్‌ఐల బాధ్యతల స్వీకరణ



సీపీకి మొక్కను అందజేస్తున్న ఎస్‌ఐ రాజు

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి ఎస్‌ఐగా ఎల్.రాజు సోమవారం బాధ్యతలు చేపట్టారు. అంతకు ముందు మల్లికార్జున స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సీపీ అనురాధను మర్యాద పూర్వకంగా కలిసి మొక్కను అందించారు. శాంతి భద్రతలకు పెద్దపీట వేయాలని ఆయనకు సూచించారు. ఆయన సిరిసిల్ల జిల్లాలో విధుల నిర్వహించి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అసాంఘి క కార్యక్రమాలు, జూదం, మద్యం, గంజాయి, డగ్స్ వంటి వాటిపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. పోలీస్ సిబ్బంది నూతన ఎస్‌ఐకి శుభాకాంక్షలు తెలిపారు.

భూంపల్లి ఎస్‌ఐగా హరీశ్

సిద్దిపేటకమాన్/మిరుదొడ్డి(దుబ్బాక): భూంపల్లి పోలీసుస్టేషన్ నూతన ఎస్‌ఐగా హరీశ్‌గౌడ్ బాధ్యతలు చేపట్టారు. సీపీ అనురాధను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమె ఎస్‌ఐ హరీశ్‌ను అభినందించారు. సైబర్ నేరాలపై ప్రజలకు అవగహన కల్పించాలని, ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి విధులు నిర్వహించాలని సూచించారు.

అవగాహన సదస్సు



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ గణేశం

సిద్దిపేటఅర్బన్: ఇందూరు ఇంజనీరింగ్ కళాశాలలో 'ఇన్నోవేషన్, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్' పై సోమవారం విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రిన్సిపాల్ ఈ అవగాహన బీటెక్, ఎంబీఏ విద్యార్థుల ఎదుగుదలకు ఉపయోగపడుతుందన్నారు. ముఖ్య అతిథిగా హాజరైన ప్రొఫెసర్ గణేశం మాట్లాడుతూ అవసరమైన నైపుణ్యాలు పెంచుకోవాలన్నారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బెనర్జీ, ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ పరశురాములు, అసిస్టెంట్ కోఆర్డినేటర్ శ్రీనివాస్, పీఆర్వో రఘు, ఎల్ఎన్ రావు, రహీం సుల్తానా పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలి

ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి



గజ్వేల్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ యాదవరెడ్డి

గజ్వేల్‌రూరల్: గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రజాప్రతినిధులు చొరవ చూపాలని ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి సూచించారు. సోమవారం పట్టణంలోని ఐఓసీలో ఎంపీపీ దాసరి అమరావతి అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం చేపడుతున్న పథకాలు ప్రజలందరికీ అందేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ప్రవీణ్, తహసీల్దార్ శ్రవణ్ కుమార్, ఏఓ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యం చేయవద్దు

కొండపాక(గజ్వేల్): ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యం చేయవద్దని ఎంపీపీ మంచాల అనసూయ సూచించారు. కొండపాకలోని ఎంపీపీ అత్యవసర సమావేశ మందిరంలో సోమవారం వివిధ శాఖ అధికారులు, పంచాయతీ కార్యదర్శులచే ప్రజా పాలనపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రత్యేకాధికారుల పనితీరుల వల్ల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్న విషయం తమ దృష్టికి వచ్చిందన్నారు. గ్రామాల్లో సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు.

పంచాయతీగా పునరుద్ధరించండి

దుబ్బాక: మున్సిపాలిటీ పరిధిలో ఉన్న లచ్చపేట వార్డును గ్రామ పంచాయతీగా పునరుద్ధరించాలని గ్రామ సాధన సమితి సోమవారం కలెక్టర్ మను చౌదరికి వినతి పత్రం అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ గ్రామ పంచాయతీని గతంలో ప్రజల అభీష్టానికి వ్యతిరేకంగా దుబ్బాక మున్సిపాల్టీలో కలిపారన్నారు. అందువల్ల ఉపాధి హామీ పథకం కోల్పోవడంతో పేద ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అలాగే పన్నులు అధికంగా ఉండడంతో చాలా అవస్థలు పడాల్సి వస్తుందని వాపోయారు.

పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం

మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత



పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్న చైర్‌పర్సన్ రజిత

హుస్నాబాద్: ఇంటి పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రతతోనే ప్రజలు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత అన్నారు. స్థానిక రెండో వార్డులో 'సఫారి అప్నా బీమారి భగావో' అనే అంశంపై సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డయేరియా, చికున్‌గున్యా, మలేరియా, టైఫాయిడ్, డెంగ్యూ వంటి సీజనల్ వ్యాధులు రాకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇంటిలో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని, తడి, పొడి, హానికరమైన చెత్తను వేరుచేసి మున్సిపల్ వాహన కార్మికులకు అందించాలని కోరారు. చెత్త వేరుచేసి ఇవ్వకపోతే జరిమానా విధిస్తామని చైర్‌పర్సన్ హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ అనిత, కమిషనర్ మల్లికార్జున్, కౌన్సిలర్ బోజు రమాదేవి, మున్సిపల్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మరమ్మతులు చేయిస్తాం: ఏఈ



సీసీరోడ్డును పరిశీలిస్తున్న ఏఈ స్నేహ

సాక్షి ఎఫెక్ట్..

అక్కన్నపేట(హుస్నాబాద్): 'నాణ్యతలేక...పట్టించుకోక' మూడు నెలల కిందట సీసీ రోడ్డు నిర్మాణం.. కంకర తేలిన వైనం అనే శీర్షికన సాక్షిలో ప్రచురితమైన కథనానికి పంచాయతీరాజ్ ఏఈ స్నేహ స్పందించారు. ఈ సందర్భంగా ఆమె సోమవారం అక్కన్నపేట మండల కేంద్రంలోని మంజ్యానాయక్‌తండాకు వెళ్లి ధ్వంసమైన సీసీ రోడ్డును పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కంకర తేలిన సీసీ రోడ్డుకు మరమ్మతులు చేయిస్తామన్నారు. సీసీ రోడ్డు నిర్మించిన రెండు రోజులకే ట్రాక్టర్లు, ద్విచక్రవాహనాలు వెళ్లడంతో కంకర తేలిందని చెప్పారు. రోడ్డు నిర్మించిన 28రోజుల తర్వాతే ఆ రోడ్డుపై రాకపోకలు సాగించాలని, ప్రజలు కూడా బాధ్యతగా ఉండి సీసీ రోడ్డుపై నీళ్ల పట్టాలని సూచించారు. బిల్లులు ఇంకా చెల్లించలేదని, దెబ్బతిన్న సీసీ రోడ్డుకు మరమ్మతులు చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించామని చెప్పారు.

అధైర్యపడొద్దు అండగా ఉంటాం



నోట్‌బుక్‌లు, పెన్నులను అందజేస్తున్న సీఐ శ్రీను

మద్దూరు(హుస్నాబాద్): తల్లి దండ్రులను కోల్పోయిన చిన్నారులు అధైర్యపడొద్దు అని, అండగా నిలుస్తామని చేర్యాల సీఐ శ్రీను అన్నారు. సాక్షిలో ప్రచురితమైన ఈ వార్తను చూసిన సిద్దిపేట పోలీస్ కమిషనర్ అనురాధ స్పందించారు. ఆ చిన్నారుల వివరాలు సేకరించి, వారికి అండగా ఉంటామని భరోసా కల్పించాలని సీఐను ఆదేశించారు. దీంతో సోమవారం సీఐ శ్రీను కరుణాకర్, దివ్యల కుమారులను కలిశారు. వారికి నోట్ పుస్తకాలు, పెన్నులు అందించారు.

'వేద'తోనే నాణ్యమైన విద్య

కరస్పాండెంట్ పసల సంతోష్



పాఠశాల కరస్పాండెంట్ సంతోష్, హెచ్‌ఎం పసల శోభారాణి

కొండపాక: 'నేటి బాలలే రేపటి పౌరులు' అన్నారు పెద్దలు. దేశ భవిష్యత్‌కు ఉపయోగపడే అలాంటి పౌరులను ఉన్నతంగా తీర్చిదిద్దగలిగేది తరగతిగదే. విద్యార్థులు భవిష్యత్‌లో ఉన్నత స్థానాలకు ఎదగాలంటే పటిష్టమైన పునాది చాలా అవసరం. అది ప్రాథమిక స్థాయిలోనే పడాల్సిఉంది. విద్యార్థుల జీవితంలో అలాంటి పటిష్టమైన పునాది పడేవిధంగా నిరంతరంగా శ్రమించటమే వేద ఇంగ్లిష్ మీడియం పాఠశాల ప్రత్యేకత అని స్కూల్ కరస్పాండెంట్ పసల సంతోష్ పేర్కొన్నారు. సోమవారం స్కూల్లో నిర్వహించిన ఒక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత తల్లిదండ్రుల వ్యయ ప్రయాసలను తెలుకొని తక్కువ వ్యయంతో ఉత్తమ విద్యను అందిస్తున్నామన్నారు. 2014–2015 విద్యా సంవత్సరంలో కుకునూరు మండల కేంద్రంలో కేవలం 10మందితో ప్రారంభించామని ఇప్పుడు తమ పాఠశాలలో 650 మంది విద్యార్థులున్నారని తెలిపారు. ప్రారంభంలో ఎన్నో ఇబ్బందులు ఎదురయ్యాయని, విద్యార్థుల తల్లిదండ్రుల సహకారం, శ్రేయోభిలాషుల ప్రోత్సాహం, ఉపాధ్యాయుల శ్రమతో వాటన్నింటినీ అధిగమించామని చెప్పారు. విద్యార్థులకు ఉన్నత ప్రమాణాలతో విద్యను అందించాలనే దృఢ సంకల్పంతో ముందుకు సాగుతున్నామని పేర్కొన్నారు. విద్యార్థులకు మరిన్ని వసతులను కల్పించేందుకు నూతన పాఠశాల భవన నిర్మాణానికి ప్రణాళికలను రూపొందించుకున్నామని, ప్రీ ప్రైమరీ విద్యార్థులు విద్యాభ్యాసంపై మక్కువ పెంచుకునే విధంగా తరగతిగదిలో ఆధునిక పరికరాలను ఏర్పాటు చేసి బోధిస్తున్నామని చెప్పారు. అంతే కాకుండా విద్యార్థులకు దేశ సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన కల్పించేలా వివిధ పండుగలను కూడా నిర్వహిస్తున్నామని, అలాగే ఆరోగ్యం పెంపొందించేకునేందుకు యోగా, స్వీయ రక్షణకు కరాటేలోను శిక్షణ ఇస్తున్నట్టు పేర్కొన్నారు. తమ విద్యార్థులు ఉన్నత శిఖరాలను అందుకోవాలనేదే తమ వేద ఇంగ్లిష్ మీడియం స్కూల్ అంతిమ లక్ష్యమని చెప్పారు. కార్యక్రమంలో హెచ్‌ఎం పసల శోభారాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



కంప్యూటర్లపై శిక్షణలో చిన్నారులు



సాంస్కృతిక కార్యక్రమంలో విద్యార్థులు

వైద్యుడు దేవుడితో సమానం

టీఎన్‌జీఓ జిల్లా అధ్యక్షుడు పరమేశ్వర్



సిద్దిపేటకమాన్: డీఎంహెచ్‌ఓను సన్మానిస్తున్న టీఎన్‌జీఓ నాయకులు

సిద్దిపేటకమాన్: అన్ని వృత్తుల కన్నా వైద్యవృత్తి పవిత్రమైందని, వైద్యుడు దేవుడితో సమానమని టీఎన్‌జీఓ జిల్లా అధ్యక్షుడు పరమేశ్వర్ అన్నారు. అంతర్జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా కలెక్టరేట్‌లోని డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో డీఎంహెచ్‌ఓ శ్రీనివాస్, డాక్టర్ కాశీనాథ్‌లను సోమవారం సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్య వృత్తి ఎంతో అపురూపమైనదన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి విక్రమ్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, వైద్యులు విజయలక్ష్మి, రజని, శ్రీదేవి, నరేశ్, నగేశ్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

వాసవీక్లబ్ ఆధ్వర్యంలో

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): వాసవీక్లబ్, వనిత క్లబ్ ఆధ్వర్యంలో డాక్టర్స్ డే, చార్టడ్ అకౌంటెంట్ డే వేడుకలు నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని వైశ్యభవన్‌లో పలువురు డాక్టర్‌లు, చార్టడ్ అకౌంటెంట్లను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రవిచంద్రన్, వేణుకుమార్, వాణి, మర్యాల వాణి, యాద శ్రీనివాస్, శ్రీనివాస్, వీరేశం తదితరులు పాల్గొన్నారు.

దుబ్బాకటౌన్‌లో..

పట్టణంలో అంతర్జాతీయ డాక్టర్స్ డే దినోత్సవం సందర్భంగా 5 సంవత్సరాల నుండి దుబ్బాకలోని పిల్లల ఆసుపత్రిలో సేవలందిస్తున్న వైద్యుడు వంశీ కృష్ణారెడ్డిని బీజేవైఎం పట్టణ అధ్యక్షుడు పల్లె నేహాల్ గౌడ్, గణేశ్ ఘనంగా సన్మానించారు. అనంతరం కేక్ కట్ చేశారు.

సంక్షిప్త వార్తలు

◆ గౌడ హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడిగా వెంకట్‌గౌడ్

గజ్వేల్‌రూరల్: గౌడ హక్కుల పరిరక్షణ సమితి సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా గజ్వేల్ మండలం బూర్గుపల్లికి చెందిన సర్దార్ పంజాల వెంకట్‌గౌడ్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా సంఘం జాతీయ అధ్యక్షుడు నక్క కృష్ణాగౌడ్ సోమవారం నియామక పత్రాన్ని అందజేశారు. వెంకట్‌గౌడ్ మాట్లాడుతూ గౌడ హక్కుల సాధనకు కృషి చేస్తానన్నారు.

◆ ఎమ్మెల్యే పరామర్శ

నంగునూరు(సిద్దిపేట): రాజగోపాల్‌పేట మాజీ సర్పంచ్ ఎల రాజేంద్ర తల్లి వీరమ్మ ఇటీవల అనారోగ్యంతో మరణించడంతో సోమవారం ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. అలాగే కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న మాజీ సర్పంచ్ సీల రాజవ్వను పరామర్శించి ధైర్యం చెప్పారు. ఆయన వెంట మాజీ ఎంపీపీ శ్రీకాంత్‌రెడ్డి, సోమిరెడ్డి, రమేశ్‌గౌడ్, సారయ్య, చందు, రాజుగౌడ్, మధు తదితరులు ఉన్నారు.

◆ బదిలీలు సహజం

కొండపాక(గజ్వేల్): ఉద్యోగులకు బదిలీలు సహజమని వైస్ ఎంపీపీ దేవి రవీందర్ అన్నారు పేర్కొన్నారు. కుకునూరుపల్లి మండలంలోని లకుడారం ప్రాథమిక పాఠశాలలో 14ఏళ్ల పాటు పనిచేసి బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయురాలు కవితకు సోమవారం ఘనంగా వీడ్కోలు సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ముక్తేందర్‌రెడ్డి, ఉపాధ్యాయులు సంతోష్, నర్సింహులు, అరవింద్, బాలకృష్ణ, రాజు పాల్గొన్నారు.

◆ మమ్మల్ని వదిలి వెళ్లొద్దు..

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): టీచర్ మమ్మల్ని వదిలి వెళ్లొద్దు అంటూ విద్యార్థులు కన్నీరు పెట్టుకున్నారు. సోమవారం యూపీఎస్ కళ్లకుంట కాలనీలో హెచ్‌ఎంగా విధులు నిర్వహిస్తున్న జయశ్రీ బదిలీపై వెళ్తుండడంతో విద్యార్థులు కన్నీరుమున్నీరయ్యారు.

◆ సొంత నిధులతో రోడ్డు పనులు

కొండపాక(గజ్వేల్): కుకునూరుపల్లి మండలంలోని మంగోల్ గ్రామంలోని కట్టమైసమ్మ తల్లి దేవాలయం నుంచి ఎల్లమ్మ దేవాలయం మీదుగా కొనాయిపల్లికి వెళ్ళే రోడ్డుకు మాజీ సర్పంచ్ పుల్లోజు కిరణ్‌కుమార్‌చారి సొంత ఖర్చులతో మరమ్మతులు చేయించారు. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరుకాకపోవడంతో అధికారులు పట్టించుకోలేదు. దీంతో ఆయన రూ.30వేలు ఖర్చుచేసి మరమ్మతులు చేయించారు.

◆ ఎల్లమ్మ ఆలయంలో చోరీ

సిద్దిపేటరూరల్: ఎల్లమ్మ ఆలయంలో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. నారాయణరావుపేట మండల పరిధిలోని జక్కాపూర్‌లో ఆదివారం రాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది. గ్రామంలోని సారగు ఎల్లమ్మ ఆలయంలో ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్న శివాల రామచంద్రం రోజులాగే ఆలయంలో లైట్లు ఆన్ చేసి ఇంటికి వచ్చాడు. సోమవారం ఉదయం ఆలయంలో మైక్ ఆన్ చేద్దామని వెళ్లగా ఆలయ ద్వారం తాళం పగిలిపోయి ఉండడాన్ని గమనించాడు. హుండీలోని రూ.30 వేలు, రెండున్నర తులాల బంగారు పుస్తెలతాడు, వెండి ఆభరణాలను అపహరించినట్లు గుర్తించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

◆ పంచాయతీకి తాళం వేసి నిరసన

మద్దూరు(హుస్నాబాద్): ఎనిమిది నెలల నుండి పంచాయతీ కార్మికులకు వేతనాలు చెల్లించడం లేదని పంచాయతీ కార్మికులు దూల్మిట్ట మండల కేంద్రంలోని పంచాయతీకి తాళంవేసి నిరసన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ వేతనాలు రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు స్పందించి వేతనాలు చెల్లించాలని కోరారు.

◆ అక్రమ పట్టాలు రద్దు చేయాలి

హుస్నాబాద్‌రూరల్: ప్రభుత్వ భూములను అక్రమంగా పట్టా చేయించుకున్న పట్టాలను రద్దు చేయాలని ధర్మస్వరాజ్ పార్టీ నాయకులు సోమవారం తహసీల్దార్‌కు ఫిర్యాదు చేవారు. పోతారం(ఎస్) గ్రామంలోని ప్రభుత్వ భూమి ఆరు ఎకరాలను ప్రభుత్వ ఉద్యోగులు, భూస్వాములు ఆక్రమించారని ధర్మస్వరాజ్ పార్టీ నాయకుడు చెంచెల ఎల్లయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు.

◆ వాసవీ మాతకు ప్రత్యేక పూజలు

దుబ్బాకటౌన్: దర్మశాల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో శ్రీకన్యకా పరమేశ్వరీ వాసవీ మాతకు సోమవారం మహాభిషేకాన్ని ఘనంగా నిర్వహించారు. 102 రకాల ప్రసాదాలతో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అమ్మవారికి 40 రోజుల నుండి ప్రతీరోజూ పూజలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో శ్రీనివాస్, రత్నాకర్, హేమలత తదితరులున్నారు.